సాక్షి అనంతపురం

శుక్రవారం । 18 । జూలై । 2025



పనులు ఇలా.. సాగు ఎలా?

హెచ్చెల్సీ, పీఏబీఆర్, ఎంపీఆర్ రెగ్యులేటర్ల నిర్మాణ పనులు సా....గుతుండడంతో పంటల సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టం రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/22.7°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఉరవకొండలో రాష్ట్ర విజిలెన్స్ అధికారుల సోదాలు



ఫర్టిలైజర్ షాపులో ఎరువులను తనిఖీ చేస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారులు

ఉరవకొండ: పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను రాష్ట్ర విజిలెన్స్ అధికారుల బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. స్థానిక సంకల్ప్, అయ్యన్ హనుమాన్ ఫర్టిలైజర్ షాపుల్లో విజిలెన్స్ ఏడీఏ సాయిరెడ్డి, ఎస్ఐ నరేంద్రభూపతి, టెక్నికల్ ఏఓ రాకేష్ నాయక్ బృందం సోదాలు చేపట్టింది. ఎరువులు, ఇతర క్రిమి సంహారక మందులు, వాటికి సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సంకల్ప్ షాపులో రూ.77,500 విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు. కాలం చెల్లిన, నకిలీ మందులను రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తే అలాంటి షాపులను సీజ్ చేస్తామని షాపు నిర్వాహకులకు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణుడు, ఏఈఓ భరత్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి–చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి–చర్లపల్లి మధ్య ఆగస్టు 3 నుంచి 25 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి జంక్షన్ నుంచి (07481) ఆగస్టు 3వ తేదీ రైలు బయలుదేరుతుందన్నారు. తిరిగి చర్లపల్లి జంక్షన్ నుంచి (07482) 4వ తేదీ సోమవారం ప్రారంభమవు తుందన్నారు. రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిప్రతి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. స్పెషల్ రైళ్లలో 3టైర్ ఏసీ మాత్రమే ఉంటుందన్నారు.

తపాలా సేవలకు అంతరాయం

అనంతపురం సిటీ: తపాలా సేవలకు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఆ శాఖ అనంతపురం డివిజన్ సూపరింటెండెంట్ కె.ఆదినారాయణ గురువారం తెలిపారు. ఈ నెల 22న కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 మార్చనున్నట్లు వివరించారు. ఈ కారణంగా ఆయా తేదీల్లో సేవలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తపాలా శాఖలోనూ అనేక రకాల సేవలను విస్తృతపరచి సత్వర, జవాబుదారీగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంచండి



మాట్లాడుతున్న గోవిందనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ (సార్వత్రిక విద్యాపీఠం) ద్వారా 2025–26 విద్యా సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్ అడ్మిషన్లు పెంచాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక సైన్స్ సెంటర్‌లో జిల్లా వ్యాప్తంగా ఎంఈఓ–1,2లు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందనాయక్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గత ఏడాది కంటే ఈసారి మరిన్ని అడ్మిషన్లు పెంచేలా చూడాలన్నారు. చదువు మధ్యలో మానేసిన, రెగ్యులర్ స్కూళ్లు, కళాశాలలకు వెళ్లేందుకు వీలుకాని వారు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న వారికి ఇదొక మంచి అవకాశం అన్నారు. ఎంఈఓలు, కో– ఆర్డినేటర్లు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అడ్మిషన్లకు సంబంధించిన వాల్ పోస్టర్లు, బుక్ లెట్లు, కరపత్రాలను అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామానికి చెందిన నగేష్ యాదవ్, ప్రేమనాథ్ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లుగా అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టి వాహనాలను సీజ్ చేసి, ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చేదెక్కిన చీనీ

చీనీ చేదెక్కింది. రైతులకు ఈ ఏడాది నష్టాలు మిగిల్చింది. గిట్టుబాటు ధరల్లేక అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు. చేసేదేమీ లేక అయినకాటికి అమ్ముకుంటున్నారు. 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు ఏడాది పొడవునా తీసుకున్నా మార్కెటింగ్ పరిస్థితి నిరాశాజనకమే! దీంతో రైతులు ఆవేదనలో కూరుకుపోయారు. ఆదుకోవాల్సిన చంద్రబాబు సర్కారు మౌనం పాటిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ క్రయవిక్రయాలు

- మే నెల మినహా ఏడాది పొడవునా ధరలు తగ్గుముఖం
- టన్ను రూ.20 వేలు కూడా పలకని వైనం
- రైతులకు కోలుకోలేని దెబ్బ
- చంద్రబాబు సర్కారు మౌనముద్రపై సర్వత్రా విమర్శలు

అనంతపురం అగ్రికల్చర్: చీనీ తోటలకు 'అనంత' ప్రసిద్ధి. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 92 వేల ఎకరాల భారీ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఏటా విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. ఇక్కడి రైతులు ప్రతికూల పరిస్థితులను అధిగమించి నాణ్యమైన చీనీ కాయలు పండిస్తున్నారు. ఏడాది పొడవునా 5.20 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఫలసాయం వస్తుండగా, ఏటా రూ.1,500 కోట్లకు పైగా టర్నోవర్ జరుగుతున్నట్లు ఉద్యానశాఖ నివేదికలు చెబుతున్నాయి. గార్లదిన్నె మండలంలో 18 వేల ఎకరాలు, యల్లనూరు 11,296, కూడేరు 9,300, పామిడి 5,300, నార్పల 5,200, పుట్లూరు 5 వేలు, ఆత్మకూరు 4,200, అనంతపురం 3,900, పెద్దపప్పూరు మండలాల్లో 3,500 ఎకరాల్లో చీనీ తోటలు విస్తరించాయి. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో చీనీ సాగు చేస్తున్నారు. ఏడాది పొడవునా పంట చేతికివస్తుంది. అయితే, మార్చి నుంచి సెప్టెంబర్ వరకు క్రయ విక్రయాలు జోరుగా ఉంటాయి. అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులోనే ఏటా లక్ష మెట్రిక్ టన్నుల వరకు క్రయ విక్రయాలు ఉంటాయి. మిగతావి తోటల నుంచి నేరుగా డబుల్ సూట్ పద్ధతిలో వ్యాపారులు కొనుగోలు చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు.

ఉత్తరాది రాష్ట్రాలకు సింహభాగం..

జిల్లాలో పండించే చీనీలో 70 నుంచి 80 శాతం వరకు రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ లాంటి ఉత్తరాది ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. చీనీ పంటకు సంబంధించి ఎకరాకు ఏటా రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో టన్ను రూ.40 వేలు, అంతకన్నా ఎక్కువ లభిస్తే కాని గిట్టుబాటు కాదు. అయితే ఈ ఏడాది మార్కెట్ పరిస్థితి దారుణంగా ఉండటంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. మేలో మాత్రమే గరిష్ట ధర రూ.40 వేల పైచిలుకు పలికింది. మిగతా నెలల్లో టన్ను సరాసరి రూ.20 వేలకు మించి పలకలేదు. ఇటీవల ధరలు మరింత పతనావస్థకు చేరుకున్నాయి. కనిష్ట ధర అయితే రూ.5 వేల లోపు పలకడం గమనార్హం. ప్రధానంగా కోతలు అధికంగా ఉండే మార్చి నుంచి ఆగస్టు మధ్యకాలంలో కేవలం మేలో మాత్రమే ఓ మాదిరి ధరలు లభించాయి.ఇలాంటి రేట్లతో ఎలా గట్టెక్కాలంటూ చీనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం ద్వారా చీనీ రైతులకు పెద్ద ఎత్తున పరిహారం ఇవ్వడంతో ఉపశమనం లభించింది. కానీ, చంద్రబాబు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు.

అనంతపురం మార్కెట్‌యార్డు ద్వారా 2024 జూన్ నుంచి 2025 జూన్ మధ్య చీనీ అమ్మకాలు, ధరలు ఇలా

నెల	చీనీ అమ్మకాలు	టన్ను గరిష్ఠం (రూ.లలో)	సరాసరి(రూ.లలో)	కనిష్ట ధర(రూ.లలో)
జూన్-2024	16,591 టన్నులు	38 వేలు	20 వేలు	10 వేలు
జూలై	21,482 ,,	23 వేలు	14 వేలు	2,500
ఆగస్టు	10,189 ,,	24 వేలు	15 వేలు	8 వేలు
సెప్టెంబర్	753 ,,	24 వేలు	15 వేలు	10 వేలు
అక్టోబర్	86 ,,	33 వేలు	16 వేలు	8 వేలు
నవంబర్	1,475 ,,	39,200	18 వేలు	5 వేలు
డిసెంబర్	684 ,,	40,100	20 వేలు	4 వేలు
జనవరి-2025	454 ,,	30 వేలు	15 వేలు	5 వేలు
ఫిబ్రవరి	1,407 ,,	24,300	14 వేలు	3 వేలు
మార్చి	15,041 ,,	26 వేలు	13 వేలు	2,500
ఏప్రిల్	26,854 ,,	27 వేలు	14 వేలు	2,600
మే	19,015 ,,	43 వేలు	20 వేలు	2,600
జూన్	16,004 ,,	34 వేలు	16 వేలు	2,500

ఎలాంటి సాయం అందలేదు



చీనీ పంటకు గిట్టుబాటు ధరల్లేక రైతులు దిగాలుగా ఉన్నారు. రూ. లక్షలు ఖర్చు పెట్టి ఆరుగాలం కష్టించి చీనీ చెట్లు పెంచుతారు. ధరల్లేకపోవడంతో కొంత మంది రైతులు చెట్లు నరికేస్తున్నారు. చీనీ సాగు కష్టంగా మారింది. గార్లదిన్నె మండలంలో పండే చీనీకి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. పంట చేతికి వచ్చిన సమయంలో ఈ ఏడాది మే నుంచి మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం నుంచి కూడా చీనీ రైతులకు ఎలాంటి సాయం అందలేదు. గతంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం సకాలంలో అందేవి.

– కొల్లాకర్, రైతు, పెనకచెర్ల గ్రామం, గార్లదిన్నె మండలం

ఆధార్ అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: "ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియల్లో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై క్రిమినల్ కేసులు తప్పవు" అని డీఆర్‌ఓ ఎ.మలోల అన్నారు. డీఆర్‌ఓ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాటాడుతూ మీ–సేవ, నెట్ సెంటర్లను తప్పనిసరిగా తనిఖీ చేయాలని చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఐదేళ్ల నుంచి 17 ఏళ్ల వారికి సంబంధించి ఆధార్ నవీకరణ జరగాల్సి ఉందన్నారు. ఆధార్ నమోదులో జిల్లా 2వ స్థానంలో ఉందని, సెప్టెంబరు నెలాఖరుకు 100 శాతం పూర్తి చేసి తొలిస్థానంలోకి తీసుకురావాలని చెప్పారు. జిల్లాలో 72 గ్రామ సచివాలయాలు, 16 ఈ సేవ కేంద్రాలు, 9 పోస్టాఫీసులు, 6 బీఎస్ఎన్ఎల్ ఆఫీసులు, 21 బ్యాంకుల్లో ఆధార్ నమోదు చేస్తారన్నారు. వైద్య కుటుంబ సంక్షేమశాఖ కార్యాలయం ద్వారా ఆధార్ నమోదు బయోమెట్రిక్ అప్‌డేట్ చేపడుతున్నామని తెలిపారు. 0–5 ఏళ్ల పిల్లలు జిల్లాలో 2,25,335 మంది ఉండగా, ఈ ఏడాది జూన్ 30 నాటికి 1,75,213 మందికి ఆధార్ కార్డులు జారీ చేశామని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆధార్ అనుసంధానంగా ఉంటుందని, పొరపాట్లకు తావివ్వకుండా నమోదు ప్రక్రియ పక్కాగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆధార్ పర్యవేక్షణ అధికారి నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

నీటి వనరుల ఆక్రమణ, అక్రమ కట్టడాలపై తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ ఎ.మలోల ఆదేశించారు. వాచ్‌డాగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలు, పంచాయతీల పరిధిలోని నీటివనరుల్లో ఆక్రమణల కారణంగా సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఇలాంటి వాటిని నిరోధించడంలో అలసత్వ ధోరణి పనికిరాదన్నారు. నీటి వనరుల ఆక్రమణలు, అక్రమ కట్టడాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓ కేశవరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వేలతో ఎమ్మెల్యేల హడల్

- మట్టి, ఇసుక, మద్యం దోపిడీపై ప్రశ్నలు
- దాదాపు ఎమ్మెల్యేలందరి తీరుపై సామాన్యుల మండిపాటు
- ఇద్దరు మంత్రులతో సహా 8 మందిపై తీవ్ర వ్యతిరేకత
- భయాందోళనలో ప్రజాప్రతినిధులు
- స్థానిక ఎన్నికలపై ప్రభావం పడుతుందని కేడర్ ఆందోళన



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పాలన మొదలుపెట్టి ఏడాది తిరక్కుండానే టీడీపీ ఎమ్మెల్యేల్లో సర్వేల గుబులు మొదలైంది. సంవత్సరంలోనే నాలుగేళ్ల వ్యతిరేకతను మూటగట్టుకున్నట్టుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. ఓ వైపు ముఖ్యమంత్రే స్వయానా ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం) ద్వారా సర్వే చేయిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం తరఫున రాబిన్ శర్మ సర్వే చేస్తున్నారని తెలుస్తోంది. ఈ రెండింట్లోనూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఇద్దరు మంత్రులతో సహా 8 మంది ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమైనట్లు తెలిసింది. మరి కొన్ని నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దీని ప్రభావం తీవ్రంగా పడనుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్టు ఉమ్మడి జిల్లాలో ప్రచారం జరుగుతోంది.

మెజారిటీ ఎమ్మెల్యేలపై..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ అభ్యర్థులే గెలిచారు. కూటమి పాలన మొదలెట్టి ఈ ఏడాది జూన్ 12 నాటికి ఏడాది దాటింది. తాజా సర్వేల ప్రకారం 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులపై వ్యతిరేకత పెల్లుబుకుతోందనే చర్చ జరుగుతోంది. ఐవీఆర్ఎస్ ద్వారా జరిగిన సర్వేలో 60 శాతం మందికి పైగా ఎమ్మెల్యేలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇద్దరు మంత్రులపైనా నిప్పులు చెరిగినట్టు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చి స్వల్పకాలమే అయినా ఎమ్మెల్యేలు, మంత్రుల వ్యవహారంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది.

వ్యతిరేకతకు ప్రధాన కారణాలివే..

- సామాన్యులకు సంబంధించిన ఖాళీ స్థలాలు కనిపిస్తే ఎమ్మెల్యేల అనుచరులం అని చెప్పి కొందరు పాగా వేసి కంచె వేస్తున్నారు. అధికారులకు చెప్పుకుంటున్నా పరిష్కారం కావడంలేదు.
- లిక్కర్ సిండికేటుగా మారి పర్మిట్‌రూములు, బెల్టుషాపుల ద్వారా పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతుండడంతో మహిళలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు.
- ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో సిఫార్సు లేఖలకు భారీగా వసూలు చేయడంతో ఉద్యోగ వర్గాల్లో వ్యతిరేకత వచ్చింది.
- అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపడితే మున్సిపాలిటీ అధికారులను పంపించి రూ. లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నారు.
- అన్ని నియోజకవర్గాల్లో ఉచిత ఇసుక అని చెప్పి.. ఎమ్మెల్యేలే అక్రమంగా ఇసుకను తరలిస్తూ సామాన్యులకు అందకుండా చేస్తున్నారు.
- పలు నియోజకవర్గాల్లో మట్టిని అక్రమంగా తోలుతూ సామాన్యులతో మాత్రం రూ. వేలకు వేలు వసూలు చేస్తున్నారు.

ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభిస్తాం

- కలెక్టర్ వినోద్‌కుమార్



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఉరవకొండ, తాడిపత్రిలో ఎంఎస్ఎంఈ పార్కులను వారంలోపు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్‌కు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. సీఎస్ గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ ఎ.మలోల, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉరవకొండ, తాడిపత్రి నియోజకవర్గాల్లో ఒక్కో చోట 20 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వారంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలను పూర్తి చేస్తామన్నారు. 'సీఐఐ' భాగస్వామ్యంతో నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మోడల్ కెరీర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్, డీపీఓ నాగరాజునాయుడు, జెడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, ఏపీఐఐసీ మేనేజర్ మల్లికార్జున, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల సంస్థ డీఎం రమేష్‌రెడ్డి, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలి

అనంతపురం: రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూ(ఏ) అడ్మిన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేయనున్న రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ నెల 19న శనివారం సెంటర్‌ను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తారని, ఈ నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఈ వి. రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి, ఆర్అండ్‌బీ జేఈ బాల కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడిపత్రిలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

తాడిపత్రి: పట్టణంలోని పాత వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నగేష్‌కుమార్ రెడ్డితోపాటు జిల్లాలోని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు హాజరవుతున్నట్లు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

భారీ పోలీస్ బందోబస్తు..

తాడిపత్రిలోకి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని రానివ్వబోమని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చెబుతున్న నేపథ్యంలో పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రధాన కూడళ్లలో నిఘా కట్టుదిట్టం చేశారు. టీడీపీ నాయకుల కదలికలపై నిఘా ఉంచారు. 100 మంది ప్రత్యేక బలగాలను మోహరిస్తున్నట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. కాగా, శుక్రవారం జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రి మార్కెట్ యార్డ్‌లో స్టాల్ ప్రారంభోత్సవం పేరుతో తలపెట్టిన కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించినట్లు తెలిసింది.



'సేవ్ ఆర్డీటీ' పోస్టుకార్డులను చూపుతున్న ఉరవకొండ మండలం లత్తవరం పాఠశాల విద్యార్థినులు

ప్లీజ్..ఆర్డీటీ ఊపిరి తీయొద్దు

పేదల పెన్నిధిగా నిలుస్తున్న ఆర్డీటీ ఊపిరి తీయొద్దంటూ విద్యార్థులు నినదించారు. ఆర్డీటీని పరిరక్షించుకుంటామంటూ ప్రతిన బూనారు. తమ ఆక్రందనను తెలియజేస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పోస్టుకార్డులు పంపారు. జిల్లాలో 'సేవ్ ఆర్డీటీ' ఉద్యమం ఉధృతమైంది. ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో ప్రతి మండలం నుంచి కనీసం 1,600 కార్డులు కేంద్ర హోంమంత్రికి పంపాలని నిర్ణయించారు. ఆ మేరకు గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు పోస్టుకార్డులను పంపారు. అంతకుముందు ర్యాలీలు నిర్వహించారు.

– ఉరవకొండ

ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తూ..

- కరుణించని వరుణుడు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా ప్రజలను వరుణుడు ఊరిస్తున్నా ఓ మాదిరి వర్షం కూడా నమోదు కాలేదు. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై మేఘాలు కమ్ముకుంటున్నా తేలికపాటి, తుంపర్లకే పరిమితమవుతున్నాయి. పదును వర్షం కోసం అన్నదాత ఆకాశం వైపు చూస్తున్నా వరుణుడు కటాక్షించడం లేదు. ఖరీఫ్ పంటలు విత్తుకునేందుకు సమయం చివరి దశకు చేరుకుంది. నెలాఖరు లోపు ప్రధాన పంటలు విత్తుకోవాలి. ఆగస్టులో విత్తుకుంటే పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని గత అనుభవాలు చెబుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం. దీంతో వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి దాదాపు నెల రోజులకు పైబడి ఎదురుచూస్తున్నారు. అడపా దడపా కురిసిన అరకొర వర్షాలకు అక్కడక్కడా పంటలు విత్తుకున్నా... ఇటీవల గాలులకు వాడుముఖం పడుతున్నాయి. అలాగే చీడపీడల తాకిడి మొదలు కావడంతో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. రెండు మూడు రోజుల్లో మంచి వర్షపాతం నమోదైతే కానీ ఖరీఫ్ ఏరువాక ముందుకు కదిలే పరిస్థితి కనిపించడం లేదు. రాగల మూడు రోజులు (18, 19, 20తేదీలు) జిల్లాకు మోస్తరుగా వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు ప్రకటించారు. కనీసం 20 మి.మీ వర్షపాతం నమోదైతే పంటలు విత్తుకోవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

బొల్లనగుడ్డంలో హత్య కలకలం


వన్నూరుస్వామి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బొమ్మనహాళ్: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో ఓ వ్యక్తి మృతి కలకలం రేపింది. తండ్రిని కొడుకు హత్య చేసినట్లుగా వదంతులు చెలరేగాయి. దీంతో బొమ్మనహాళ్ పోలీసులు గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. ఎస్ఐ నబీరసూల్, గ్రామస్తులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (45) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై తరచూ భార్య లింగమ్మ, కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. గురువారం ఉదయం మద్యం మత్తులో కొడుకు మోహన్‌తో గొడవ పడుతూ ఒక్క సారిగా కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వన్నూరుస్వామి మృతి చెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని తీసుకువచ్చారు. అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. నివేదికలో హత్య కాదని, గుండెపోటుతో మృతి చెందినట్లుగా స్పష్టం కావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

యల్లనూరు: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం దుగ్గపల్లికి చెందిన రామ్మోహన్ (45)కు భార్య సావిత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం గొర్రెలను మేపునకు తోలుకెళ్లిన ఆయన ఆగ్రమ శివారులో తెగిపడిన విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేశారు.

పనులు ఇలా! పంటల సాగు ఎలా?

- కొనసాగుతున్న హెచ్చెల్సీ, పీఏబీఆర్, ఎంపీఆర్ రెగ్యులేటర్ల నిర్మాణ పనులు
- పనులు పూర్తి కాకపోవడంతో జిల్లా సరిహద్దులోనే ఆగిన తుంగభద్ర జలాలు
- పనులు పూర్తవడానికి మరో రెండు నెలలకు పైగా సమయం
- నవంబర్ ఆఖరుకు నీటి విడుదల నిలుపుదల



పీఏబీఆర్ హెడ్ రెగ్యులటరీ పనుల్లో భాగంగా బెడ్డింగ్ పనులు జరుగుతున్న దృశ్యం, కొనసాగుతున్న ఎంపీఆర్ రెగ్యులటరీ పనులు


శిథిలావస్థకు చేరిన పీఏబీఆర్ షట్టర్లు

ఉరవకొండ: హెచ్చెల్సీకి నీరు విడుదలైనా కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అవి జిల్లా సరిహద్దులోనే ఆగిపోయాయి. హెచ్చెల్సీలో చేపట్టిన మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేయించకపోవడమే ఇందుకు కారణం. ఈ పనులు పూర్తి కావాలంటే మరో రెండు నెలలకు పైగా సమయం పడుతుందని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ నెలాఖరుకు హెచ్చెల్సీకి నీటి విడుదల ఆపేస్తామంటూ టీబీ డ్యామ్ ఎస్ఈ నారాయణ నాయక్ రెండు రోజుల క్రితం స్పష్టం చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఫలితంగా హెచ్చెల్సీ ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారనుంది.

జిల్లా సరిహద్దులోనే నీరు

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీకి కేటాయించిన నీటి కోటాను ఈ నెల 10న డ్యామ్ అధికారులు వదిలారు. అయితే హెచ్చెల్సీలో చేపట్టిన మరమ్మతు పనులు ఎక్కడేగాని 50 శాతం కూడా పూర్తి కాకపోవడంతో నీటిని జిల్లా సరిహద్దులోని ఆపేశారు. ఉరవకొండ మండలం మోపిడి వద్ద హెచ్చెల్సీ ప్రధాన కాలువపై 189.25వ కిలోమీటరు లింక్ ఛానల్ వద్ద పీఏబీఆర్, ఎంపీఆర్ హెడ్‌రెగ్యులేటర్ల పునఃనిర్మాణ పనులను రూ.8 కోట్లతో అనంతపురానికి చెందిన ఓ నిర్మాణ సంస్థ ఈ ఏడాది ఏప్రిల్ 13న చేపట్టింది. తుంగభద్ర జలాలు పీఏబీఆర్, ఎంపీఆర్‌కు చేరాలంటే ఈ లింక్ ఛానల్ చాలా కీలకం. జిల్లాకు తాగు, సాగునీటి అవసరాలకు మోపిడి లింక్ చానల్ ద్వారానే నీరు అందాల్సి ఉంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ పనులను సకాలంలో పూర్తి చేయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పనులు ముందుకు సాగలేదు.

కమీషన్ల కోసం హడావిడిగా పనులు..

శిథిలావస్థకు చేరిన ఎంపీఆర్, పీఏబీఆర్ హెడ్ రెగ్యులేటర్ మరమ్మతుకు కూటమి ప్రభుత్వం హడావిడిగా రూ.8 కోట్లు నిధులు విడుదల చేసింది. సాధారణంగా ఏటా జూన్, జూలైలో జిల్లా సరిహద్దుకు తుంగభద్ర జలాలు చేరుకుంటాయి. అయితే ఏప్రిల్‌లో టెండర్లను ప్రభుత్వం ఆహ్వానించి, అదే నెలలో ఈ ప్రక్రియను పూర్తి చేసింది. అయితే కమీషన్ల కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి ఒత్తిళ్లు మొదలవడంతో పనులు ఆలస్యంగా ప్రారంభమైనట్లు సమాచారం. ఆ తర్వాత పనులను వేగవంతం చేయడంలోనూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. దీంతో 50 శాతం పనులు అలాగే నిలిచిపోయాయి. గతంలో కురిసిన వర్షాలతో కాలువలో పెద్ద ఎత్తున నీరు చేరిందని, దీంతో పనులు ముందుకు సాగించడం కష్టమైందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే హెచ్చెల్సీకి నీటి విడుదల సమయం దగ్గర పడుతున్న తరుణంలో కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకెళ్లడంతో నాణ్యత ప్రమాణాలు తిలోదకాలిచ్చి పనులు మమ అనిపించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

కోతలతో భారీ నష్టం

జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న హెచ్చెల్సీకి ఈ ఏడాది భారీగా కోత విధించారు. టీబీ డ్యాంలో నీటి నిల్వ ఆధారంగా కేటాయింపులు జరపగా హెచ్చెల్సీ వాటాను 18.396 టీఎంసీలకు కుదించారు. డ్యామ్ గేట్ మరమ్మతు కారణంగా 7.964 టీఎంసీల నీటిని కోల్పోవాల్సి వచ్చింది. జిల్లాలో తాగునీటి అవసరాలకు 10టీఎంసీలు అవసరం. నీటి ప్రవాహ నష్టాలు 2 టీఎంసీలు పోను జిల్లాకు అందే నీటిలో తాగునీటికి, సాగునీటికి ఏ మేర కేటాయిస్తారో అర్థం కాని పరిస్థితి. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో హెచ్చెల్సీలో చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో హెచ్చెల్సీ నీటి లభ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హెడ్ రెగ్యులేటర్ల నిర్మాణ పనులు పూర్తి కావాలంటే మరో రెండు నెలలకు పైగా సమయం పడుతుందని నిపుణులు అంటున్నారు. ఈ లెక్కన ఈ పనులు నవంబర్ నాటికి పనులు పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఈ ఏడాది హెచ్చెల్సీ కోటా కేటాయింపు

18.396 టీఎంసీలు

గేట్ల మరమ్మతు కారణంగా కోల్పోయిన కోటా

7.964 టీఎంసీలు

వేగవంతం అయ్యేలా చూస్తాం

పీఏబీఆర్, ఎంపీఆర్ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చూస్తున్నాం. ఎంపీఆర్ రెగ్యులేటర్ పనులు పూర్తి కావొచ్చాయి. పీఏబీఆర్ రెగ్యులేటర్ పనులు పెండింగ్ ఉన్నాయి. వీటిని కూడా పూర్తి చేసి జిల్లాకు నీరు అందేలా కృషి చేస్తాం.

– నజీర్, ఏఈ, హెచ్చెల్సీ

అయితే నవంబర్ నెలాఖరుకు హెచ్చెల్సీకి నీటి విడుదల నిలుపుదల చేస్తామంటూ రెండు రోజుల క్రితం టీబీ డ్యాం అధికారులు ప్రకటించడంతో హెచ్చెల్సీపై జిల్లా రైతులు, ప్రజలు పెట్టుకున్న ఆశలు కాస్త గల్లంతు కానున్నాయి.

వ్యక్తి అదృశ్యం


రామకృష్ణ

అనంతపురం: తాడిపత్రి మండలం చిన్న పొడమల గ్రామానికి చెందిన నారాయణ స్వామి కుమారుడు కమ్మగార్ల రామకృష్ణ (39) కనిపించడం లేదు. సదరం సర్టిఫికెట్ల పరిశీలన నిమిత్తం బుధవారం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి వచ్చిన ఆయన.. ఆ తర్వాత ఇంటికి చేరుకోలేదు. కాగా, రామకృష్ణకు మాటలు రావు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96806 కు సమాచారం అందించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు పార్వతి

గుమ్మఘట్ట: మండలంలోని సిరిగెదొడ్డి గ్రామానికి చెందిన వివాహిత పార్వతి (29) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన కిందింటి గోవిందుతో పార్వతికి పదేళ్ల క్రితం వివాహమైంది. తొమ్మిది నెలల క్రితం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆగమేఘాలపై ఇంటికి చేరుకుని ఆమెను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతున్న ఆమె జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

'ఎంటుఎం' యూట్యూబర్‌పై కేసు నమోదు

కదిరి అర్బన్: పాత్రికేయ వృత్తిని కించపరిచేలా వ్యవహరించారనే ఫిర్యాదుతో ఎంటుఎం యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు సుధాకర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కదిరి సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను గురువారం రాత్రి ఆయన వెల్లడించారు. విలేకరులకు ఇంటి పట్టాలపై మంజూరు విషయంగా కొన్ని రోజుల క్రితం కదిరిలో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ అంశంపై 'రాయలసీమలో ఒక ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం... మీడియాను గుప్పిట్లో పెట్టుకోవడానికేనా?' అంటూ ఓ కథనాన్ని హైదరాబాద్‌కు చెందిన ఎంటుఎం యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు సుధాకర్ పోస్టు చేశాడు. ఈ కథనం ప్రతికా విలేకరుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందని, ఇందుకు బాధ్యులైన సుధాకర్‌తో పాటు అదే చానల్ అనంతపురం ప్రతినిధి వినోద్‌కుమార్, కదిరి వేమా న్యూస్ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు వేమ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు కదిరికి చెందిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ సోమశేఖరనాయుడు ఫిర్యాదు చేశాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఆంధ్రా క్రికెట్ జట్టు ప్రాబబుల్స్‌కు ఆరుగురి ఎంపిక


మచ్చా కె.దత్తారెడ్డి


అర్జున్ టెండూల్కర్


మల్లికార్జున


కమిల్


దీపక్


మహేంద్రరెడ్డి

అనంతపురం: ఆంధ్రా అండర్–23 క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ ఎంపిక గురువారం ముగిసింది. అనంతపురానికి చెందిన ఆరుగురికి చోటు దక్కింది. వీరిలో మచ్చా కె.దత్తారెడ్డి, పి.అర్జున్ టెండూల్కర్, జి.మల్లికార్జున, ఎస్.మహమ్మద్ కమిల్, టి. హేంద్ర రెడ్డి, ఎం.దీపక్ ఉన్నారు. మచ్చా దత్తారెడ్డి కుడిచేతి ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాడు. ఆంధ్ర అండర్ 23 రంజీ టోర్నీలో ప్రతిభ చాటాడు. అలాగే కుడిచేతి ఓపెనర్‌గా, ఆఫ్ స్పిన్నర్‌గా రాణిస్తున్న పి.అర్జున్ టెండూల్కర్ ఇప్పటికే ఆంధ్ర అండర్ 23, 19 జట్లలో ప్రాతినిధ్యం వహించారు. ఎడమ చేతి వాటం స్పిన్నర్ అయిన మల్లిఖార్జునకు అంతర జిల్లా మ్యాచ్‌ల్లో పది వికెట్లు తీసిన రికార్డు ఉంది. అలాగే ఎడమ చేతి మీడియ పేస్ బౌలర్ దీపక్ సైతం అంతర్ జిల్లా మ్యాచ్‌లో 11 వికెట్లు సాధించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. కమిల్ ఎడమ చేతి స్పిన్నర్. ఎడమ చేతి వాటం మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరుస్తున్నాడు. మహేంద్ర రెడ్డి కుడిచేతి వాటం మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్. అండర్–19, అండర్–23 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, మరో అర్ధసెంచరీ సాధించాడు.

ఆలయ పునరుద్ధరణ విషయంలో అభ్యంతరాలు తెలపండి

- 'అనంత' కాశీవిశ్వేశ్వరాలయం ఈఓ నాగేంద్రుడు

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలో వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం పునరుద్ధరణ విషయంలో ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఆలయ ఈఓ నాగేంద్రుడు కోరారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆయన గురువారం ఆలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆలయం పాతబడినందున పునరుద్ధరణకు భక్తమండలి సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది తీర్మానించారని గుర్తు చేశారు. ఇప్పటికే రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అయితే ఎవరికైనా అభ్యంతరాలున్నా, సలహాలు.. సూచనలివ్వాలనుకున్నా 15 రోజుల్లోపు తెలపాలన్నారు. కార్యక్రమంలో భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ


బాధితురాలిని విచారిస్తున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: స్థానిక హనుమేష్‌నగర్ ఎల్ఐసీ కార్యాలయం ప్రాంతంలో గురువారం రాత్రి చైన్‌స్నాచింగ్ జరిగింది. తన సోదరి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న మల్లీశ్వరి అనే మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును దుండగుడు లాక్కొని ఉడాయించాడు. బాధితురాలు తెలిపిన మేరకు.. మల్లీశ్వరి కర్నూలు జిల్లా మద్దికెర సుబ్రమణ్యస్వామి ఆలయంలో పనిచేస్తోంది. పనిపై తన ఇంటి నుంచి పక్క వీధిలో ఉంటున్న తన అక్క సులోచన ఇంటికి గురువారం రాత్రి నడుచుకుంటూ వెళుతుండగా బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. ఈ ఘటనతో ఆమె మెడపై గాయమైంది. గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆమెను విచారించారు. చుట్టుపక్కల గాలించినా దుండగుడి ఆచూకీ లభ్యం కాలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

గోరంట్ల (సోమందేపల్లి): వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గోరంట్ల మండలం గుంతపల్లికి చెందిన నరసింహారెడ్డి గురువారం సొంత పనిపై గోరంట్లకు వెళ్లాడు. పని ముగించుకున్న అనంతరం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన గుంతపల్లి సమీపంలోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనం నిలపకుండా దూసుకెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న గోరంట్ల పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నేడు రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం ఎన్నికలు


గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక మండలి ఎన్నికలు శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సీనియర్ డీపీఓ కోర్డినేషన్ హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్ గురువారం వెల్లడించారు. రెండేళ్ల కాల వ్యవధి ఉన్న రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక మండలికి నిర్వహించే ఈ ఎన్నికల్లో కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారితో పాటు ఆరుగురు సభ్యులను రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నుకోనున్నారు. గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో మొత్తం 943 మంది ఓటర్లు ఉన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు రైల్వే ఇన్‌స్టిట్యూట్ పోలింగ్ ప్రక్రియ ఉంటుంది. అనంతరం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి, వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ మధ్యనే ఉంది. మజ్దూర్ యూనియన్ తరఫున కార్యదర్శిగా కె.యల్లప్ప, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎస్.సతానియల్‌తోపాటు ఆరుగురు కమిటీ సభ్యులుగా పోటీ చేస్తున్నారు. ఎంప్లాయీస్ సంఘ్ తరఫున కార్యదర్శిగా మల్లికార్జున, సంయుక్త కార్యదర్శిగా షెక్షావలి, కోశాధికారిగా నాగరాజుతోపాటు ఆరుగురు కమిటీ సభ్యులుగా బరిలో నిలిచారు. కాగా డివిజన్ వ్యాప్తంగా ఇప్పటి వరకూ జరిగిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ హవా కొనసాగింది. పాకాల రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యూనియన్ 6 పోస్టులు, సంఘ్ 3 పోస్టులు కైవసం చేసుకుంది. ఇక రేణిగుంట, నందలూరు, కడప ఇన్‌స్టిట్యూట్ పాలక మండళ్లను మజ్దూర్ యూనియన్ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. గుత్తి రైల్వేఇన్‌స్టిట్యూట్‌లో క్లీన్ స్వీప్ చేసింది.

కర్నూలులో హాస్పిటల్‌పై పామిడి వాసుల దాడి

- యువతి మృతితో కుటుంబ సభ్యుల ఆందోళన
- ఆస్పత్రి అద్దాల ధ్వంసం


మృతురాలి కుటుంబీకుల దాడిలో ధ్వంసమైన మెడికల్ స్టోర్ అద్దాలు


మృతి చెందిన అనిత

కర్నూలు(హాస్పిటల్): జ్వరం కారణంగా చికిత్సకు వచ్చి యువతి మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులు గురువారం కర్నూలులోని శ్రీ చక్ర హాస్పిటల్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఆస్పత్రిపై దాడి చేసి గాజు కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారు. వంద మందికి పైగా నిర్వహించిన ఈ దాడితో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు... అనంతపురం జిల్లా పామిడికి చెందిన అనిత(21)కు కర్నూలులోని కల్లూరు ఎస్టేట్ పోలీస్ కాలనీకి చెందిన ప్లాట్ల రమణ కుమారుడు నాగేంద్రతో ఏడాది క్రితం వివాహమైంది. తండ్రితో కలిసి నాగేంద్ర రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనితకు ఈ నెల 15న జ్వరం రావడంతో సమీపంలో ఉన్న శ్రీచక్ర హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి క్యాజువాలిటీలో ఆమెకు అవసరమైన చికిత్సను అందించి సాయంత్రం ఇంటికి పంపించారు. మరుసటి రోజు బుధవారం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు. కాగా, గురువారం ఉదయం పామిడి నుంచి వచ్చిన అనిత కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో శ్రీచక్ర హాస్పిటల్ వద్దకు చేరుకున్నారు. అనితకు సకాలంలో వైద్యం అందించలేదని, మెరుగైన వైద్యం అందించి ఉంటే బతికేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళన ప్రారంభించారు. ఈ ఆందోళన క్రమంగా ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక దశలో ఆస్పత్రిపై రాళ్లు విసిరి అద్దాలు పగులగొట్టారు. బయట ఉన్న మెడికల్‌షాపు అద్దాన్ని, గాజు తలుపును ధ్వంసం చేశారు. ఆస్పత్రిలోకి చొరబడి కనిపించిన ప్రతి వస్తువునూ ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో క్యాజువాలిటీ, ఆరోగ్యశ్రీ కియోస్క్, కిటికీలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు రామయ్య యాదవ్, నాగరాజురావు, శేషయ్య, విక్రమసింహ, తబ్రేజ్, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనిత మృతితో సంబంధం లేదు

అనిత మృతికి ఆస్పత్రికి ఎలాంటి సంబంధం లేదని శ్రీచక్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనిత అనే యువతి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జ్వరంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం వచ్చిందన్నారు. క్యాజువాలిటీలోనే సాయంత్రం వరకు ఆమెకు అవసరమైన మందులు ఇచ్చి, ఫ్లూయిడ్స్ పెట్టామన్నారు. ఆమె కోలుకోవడంతో ఇంటికి వెళ్తానంటే పంపించామన్నారు. మరుసటి రోజు రాత్రి అత్యవసర పరిస్థితిలో కుటుంబసభ్యులు ఆమెను క్యాజువాలిటీకి తీసుకొచ్చారని, అప్పటికే ఆమె మృతి చెంది ఉందన్నారు. ఆమె మృతికి, ఆస్పత్రికి ఎలాంటి సంబంధం లేదని, అయినా ఆస్పత్రిపై దాడి చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఈ ఘటనపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామచంద్రనాయుడు, డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, ప్రైవేటు ఆసుపత్రుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండండి : డీఎస్పీ

కదిరి అర్బన్: చోరీలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయపావనితో కలసి ఆయన మాట్లాడారు. జిల్లాలో మధ్యప్రదేశ్ చెందిన చెడ్డీ, పార్థీ, బిల్లా గ్యాంగ్‌లతో పాటు నంద్యాలకు చెందిన చెంచు జాతి దొంగల సంచారం ఎక్కువగా ఉందన్నారు. ఈ ముఠాలు జిల్లాలోని పుట్టపర్తి, గాండ్లపెంట, ధర్మవరం, రాప్తాడు, తిరుపతి, కర్ణాటకలోని గౌరీబిదనూర్‌లో చోరీలకు పాల్పడ్డాయన్నారు. వీరు రాత్రి 12 నుంచి 3 గంటల మధ్య విశాలమైన పెద్ద ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతుంటారన్నారు. కదిరిలోని ఎన్‌జీఓ కాలనీ, వాణి స్ట్రీట్, మగ్గాల క్వార్టర్స్, సైదాపురం, వైఎస్సార్ నగర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త వ్యక్తుల సంచారంపై డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష


ఉట్లమాను పోటీలను తిలకిస్తున్న ప్రజలు

బత్తలపల్లి: కోడేకండ్ల గ్రామంలో మొహర్రంలో భాగంగా గురువారం ఉట్ల పరుషను ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలోని పీర్ల చావిడి ముందు పెద్ద గుంత ఏర్పాటు చేసి అందులో 40 అడుగుల ఉట్లమాను నిలబెట్టారు. గుంతలో బంకమట్టితో పాటు జిగురు పదార్థమైన కలబందను వేశారు. యువకులు ఉట్లమాను పైకి ఎక్కే ప్రయత్నంలో జిగురు పదార్థం వల్ల జారుతూ గుంతలోకి ఒకరిపై ఒకరు పడిపోవడాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. సుమారుగా 30 మంది యువకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడ్డారు. ఈ వేడుకలు తిలకించడానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అట్టె జస్వంత్ ఉట్లమాను పైకి ఎక్కడంతో ప్రజలు చప్పట్లు కొట్టి అభినందించారు. జలధికి పోయిన మరుసటి దినం ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

క్లుప్తంగా

జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం టవర్‌క్లాక్: కుల అహంకారంతోనే కారంచేడులో దారుణ హత్యలు జరిగాయని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1985లో కారాంచేడులో అగ్ర కులస్తులు 7 మంది మాదిగలను ఊచకోత కోసి అత్యంత దారుణంగా హత్య చేశారన్నారు. నరమేధానికి 40 సంవత్సరాలు గడిచాయని ఆ దారుణం మరువలేమన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, గణేష్, చంటి, తిరుపాలు, ఎర్రిస్వామి, రాము, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కనగానపల్లి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ఫ్లోరోసిస్ బాధితులకు చేతి కర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు, అందజేశామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్షేత్ర స్థాయిలో వెళ్లి వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వెళ్లినప్పుడు మల్టివిటమిన్ మాత్రలు తీసుకెళ్లాలని తెలిపారు. అలాగే ఆరోగ్య అలవాట్లపై తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది శశికళ, డాక్టర్ చెన్నకేశవ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులకు బ్యాడ్జులు అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

అనంతపురం: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెర్మనీ అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థి నాయకులుగా ప్రజ్ఞ, మనోజ్ సాయి, ఉప నాయకులుగా రంజిత్, లఖీ అశ్విక, క్రీడా, సాంస్కృతిక నాయకులుగా రేహాన్, ధృతిక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జులను అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అనంత రాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, సీఏఓ నరసింహా రావు, ప్రధానోపాధ్యాయురాలు శాలిని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'లీడర్‌షిప్' శిక్షణ



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ లక్ష్మీరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నాయకత్వ లక్షణాలపై ప్రధానోపాధ్యాయులకు నాలుగు రోజులుగా జరుగుతున్న 'లీడర్‌షిప్' శిక్షణ గురువారం ముగిసింది. బుక్కరాయసముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో శిక్షణ జరిగింది. 'స్వీయ అవగాహన', 'సహకారం', 'వనరుల అత్యుత్తమ వినియోగం', 'టీచ్ టూల్' అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో అనుసరించాల్సిన విధి విధానాలు, సంస్థలను నడిపేందుకు నాయకత్వ లక్షణాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 235 మంది ప్రధానోపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. కోర్సు డైరెక్టర్లుగా ఎంఈఓ-2లు గురుప్రసాద్, లింగా నాయక్ వ్యవహరించగా.. ఇన్‌చార్జ్ ఏఎంఓ వేణు గోపాల్ పర్యవేక్షించారు.

బీబీ ఫాతిమా పీర్ల ఊరేగింపు



పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

నగరంలోని ఐదో రోడ్డులో గురువారం బీబీ ఫాతిమా 7 కన్ను పీర్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పీర్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీబీ ఫాతిమా ఆలయ కమిటీ నిర్వాహకులు మల్లికార్జున, మహేష్, మురళి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

నాణ్యత ఏమాయే

- ఇష్టారాజ్యంగా రోడ్డు పునరుద్ధరణ పనులు
- పైపై పూత వేసి వదిలేసిన దుస్థితి
- ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ నిర్వాకం
- పట్టించుకోని ఇంజినీర్లు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో గ్యాస్ పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్లకు తూతూమంత్రంగా పూత వేసి చేతులు దులుపుకుంటున్నారు ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ నిర్వాహకులు. పైపై పూతలు పూయడంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్లతో మారుమూల ప్రాంతాల నుంచి నగర ప్రధాన రోడ్లలో బీటీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ నగరంలో గ్యాస్ పైప్‌లైన్ పనులు చేపట్టింది. నగరంలోని జడ్జి బంగ్లా, అరవింద నగర్, కృపానంద నగర్, నాయక్ నగర్, జేఎన్‌టీయూ రోడ్లలో గ్యాస్‌పైప్ పనులను గత నాలుగు నెలలుగా చేస్తున్నారు. కాగా ఇప్పటికే గ్యాస్ పేరుతో రోడ్లన్నీ ఛిద్రం చేశారు. ఇక పునరుద్ధరణ పనులను తామే చేస్తామని సదరు కంపెనీ ప్రభుత్వం నుంచి ప్రత్యేక జీఓ తెచ్చుకుంది. అయితే రోడ్లను ఇష్టమొచ్చినట్లు ధ్వంసం చేశారు. కనీసం పునరుద్ధరణ పనులైనా సక్రమంగా చేశారంటే.. అదీ లేదు. ఆ పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. రోడ్డు అర్థ్ వర్క్ సరిగా చేసుకోకవడంతో పాటు ఇసుక, కంకర, సిమెంట్‌ను కలిపి, రోలింగ్ చేసి వదిలేస్తున్నారు. వాస్తవంగా సీసీ రోడ్డు ఏవిధంగా ఉంటుందో ఆ విధంగా పునరుద్ధరణ పనులు చేపట్టాలి. భవిష్యత్తులో ఏవైనా హెవీ వాహనాలు వెళ్తే రోడ్లు దెబ్బతినేలా గుంతలను పూడ్చారు.



రోడ్డుకు నాసికరంగా సిమెంట్ పూత వేస్తున్న దృశ్యం, కనిపించని అధికారులు



రోడ్డుకు పైపై పూత వేసి వదిలేసిన దృశ్యం

ఇంజినీర్ల మొద్దునిద్ర..

నగర రోడ్లను ఏజీ అండ్ పీ ప్రథమ్‌కు నగరపాలక సంస్థ ఇంజినీర్లు ఇచ్చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైప్‌లైన్ పనులు జరిగే సమయంలోనూ నగరపాలక సంస్థ ఇంజినీర్లు అటువైపు తొంగి చూడలేదు. ఇప్పుడు పునరుద్ధరణ పనులు జరిగే సమయంలో ఇంజినీర్ల పర్యవేక్షణ ఉండాలి. కనీసం ఇంజినీర్లకు సమాచారం ఇచ్చి పనులు చేయాలి. కానీ అటువంటి పరిస్థితి లేదు. రూ.లక్షలు వెచ్చించి వేసిన రోడ్లను ఓ ప్రైవేట్ కంపెనీ పాడు చేస్తున్నా అధికారులు తమకేం పట్టదన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



జడ్జి బంగ్లా మార్గంలో జరుగుతున్న రోడ్డు పునరుద్ధరణ పనులు

శభాష్ హర్షిత



ఎస్.హర్షితను అభినందిస్తున్న జేఎన్‌టీయూ(ఏ) వీసీ సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌లో ఇటీవలే (2025) ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని ఎస్.హర్షిత రూ.21 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగం సాధించింది. అమెజాన్ కంపెనీలో కొలువు సాధించిన హర్షితను వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు కొనియాడారు. కేవలం 21 సంవత్సరాల వయస్సులో ఏడాదికి రూ.21 లక్షల వేతనం వచ్చే ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఓ.దేవన్న, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జే.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడే విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాత'



మాట్లాడుతున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. గురువారం వర్సిటీలోని మహాత్మా జ్యోతి రావు పూలే భవనంలో బీఈడీ (దూరవిద్య) విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. కార్యక్రమానికి దూర విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ జి.బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా ఇన్‌సర్వీసు టీచర్లు 5 వేల మందికి పైగా దూరవిద్య బీఈడీ కోర్సు పూర్తి చేశారన్నారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యం రాబోయే విద్యార్థి తరానికి అందించాలని ఆకాంక్షించారు. సమాజాన్ని మార్చే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడే విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదన్నారు. విద్యార్థులపై చెరగని ముద్రవేస్తుందన్నారు. అదే వృత్తిలో ఉన్న మీరు ఇక్కడ బీఈడీ కోర్సు శిక్షణకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, దూరవిద్య మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మునినారాయణప్ప, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, దూరవిద్య అధ్యాపకులు డాక్టర్ కేఎస్ శకుంతల, డాక్టర్ టీసీ సంజీవరాయుడు, వి.సాల్మాన్ రాజు, డాక్టర్ పి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి మెమోతో సరి..!

- అలా వస్తాం.. ఇలా వెళ్తాం కథనానికి స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం మెడికల్: ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్న వైద్యులకు ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా మెమోలతో సరిపెట్టారు. గురువారం సాక్షి దినపత్రికలో 'అలా వస్తాం.. ఇలా వెళ్తాం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. నిర్లక్ష్యంగా విధులకు హాజరవుతున్న అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పెథాలజిస్టు డాక్టర్ సుమత్, పల్మనాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారదలకు ప్రిన్సిపల్ మెమో జారీ చేశారు. దీనిపై సదరు వైద్యులు ప్రిన్సిపాల్‌కు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. వారి వివరణను డీఎంఈ నరసింహం, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు పంపనున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: మూడవ రోడ్డులోని ఘంటసాల భవన్ వేదికగా మూడు రోజుల పాటూ సాగే ఆధ్యాత్మిక ప్రవచనాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీనియర్ గాయకుడే పాలసముద్రం నాగరాజు ఆధ్వర్యంలో సాగిన సత్సంగానికి వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు విచ్చేశారు. తొలిరోజు ప్రఖ్యాత గ్రంథమైన 'వివేక చూడామణి'లోని ప్రధాన అంశాల గురించి డాక్టర్ పాణ్యం వసుంధర సమగ్రంగా వివరించారు. గ్రంథంలోని ఉపమానాలతో వివరించిన తీరు ఆకట్టుకుంది. శుక్రవారం భగవాన్ శ్రీరమణ మహర్షి సేవా సమితి వారు సత్సంగం నిర్వహించనున్నారు.

20న ఆషాఢం సారె సమర్పణ

అనంతపురం కల్చరల్: హౌసింగ్ బోర్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని వేదమాత గాయత్రి దేవస్థానంలో ఈనెల 20న ఉదయం 7 గంటలకు అమ్మవారికి ఆషాఢం మాస సారె సమర్పణ ఉంటుందని నిర్వాహకులు సంకేపల్లి సత్యనారాయణ తెలిపారు. గురువారం బ్రాహ్మణ ఐక్య వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బ్రాహ్మణ పెద్దలు మాట్లాడారు. అమ్మవారికి శాకంబరి అలంకారం, వడిబియ్యం, అన్నప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కార్మికులను పనిలోకి తీసుకోవాలి



ఆందోళన వ్యక్తం చేస్తున్న హమాలీ యూనియన్ కార్మికులు

రాప్తాడు: హమాలీ యూనియన్ కార్మికులను పనిలోకి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హమాలీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అయ్యవారిపల్లి పంచాయతీలో అవంతివేర్ హౌస్ గోదాములో బళ్లారి బైపాస్ హమాలీ యూనియన్ కార్మికులు అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. సౌకర్యాలు కల్పించాలని కోరినందుకు మమ్మల్నే నిలదీస్తారా .. మీరు పనిలోకి రావద్దంటూ గోదాము మేనేజర్ రామాంజనేయులు దుర్భాషలాడినట్లు తెలిపారు. ఈ విషయంపై గోదాము వద్దకు మాట్లాడానికి వెళ్తే దౌర్జన్యంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. తమను పనిలోకి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా పదాన కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు యేసురత్న, నగర కార్యదర్శి దావిద్, హమాలీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి లింగమయ్య, కార్మికులు ఐఎఫ్టీయూ కమిటీ సభ్యులు నరసప్ప, కుమార్, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టైప్-1 డయాబెటిస్‌కు ఇన్సులిన్ ఇవ్వాలి



డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

అనంతపురం మెడికల్: జిల్లాలో టైప్-1 డయాబెటిస్‌తో బాధపడుతున్న 30 మంది చిన్నారులకు (ఆర్డీటీ హాస్పిటల్‌కు వచ్చే వారు) తెలంగాణ ప్రభుత్వం ద్వారా లాంగాక్టింగ్, ర్యాపిడ్ యాక్టింగ్ ఇన్సులిన్‌ను అందిస్తున్నాం. అదేవిధంగా ఏపీ ప్రభుత్వం కూడా ఇక్కడి టైప్-1 డయాబెటిస్‌తో బాధపడే వారికి మూడు పూటల ఇన్సులిన్ అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్వీట్ సోల్స్ సొసైటీ ఫర్ టైప్-1 డయాబెటీస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కోరారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతను కలిశారు. టైప్-1 డయాబెటీస్‌తో బాధపడుతున్న వారికి ఇన్సులిన్ ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఆర్ఎంఓ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ధర్మయ్య, ప్రియాంక పాల్గొన్నారు.

హాస్టళ్ల ఏర్పాటుకు భవనాల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న డీసీఓ విజయలక్ష్మి

రాప్తాడు: మండలంలోని మరూరు గ్రామంలో ఉన్న బీసీ హాస్టల్ భవనాలను డీసీఓ విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్త భవనాల నిర్మాణానికి ఉత్తర్వులు వచ్చాయి. బాలికల హాస్టల్లు కూడా ప్రారంభించాల్సి ఉండటంతో అందుకు అనుకూలంగా ఉండే ప్రభుత్వ భవనాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. విద్యార్థులకు హాస్టల్ భవనాలు సౌకర్యంగా ఉంటాయా? లేదా ? నీటి సమస్య, పర్యావరణం, పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల డిమాండ్ మేరకు ప్రభుత్వం కొత్త హాస్టళ్లను ప్రారంభించేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న, దళిత విద్యార్థి సంఘం నాయకులు నగేష్, వరప్రసాద్, ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర నాయకులు రామాంజనేయులు జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, రాజు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయండి

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలని ఆర్టీసీ రాయలసీమ జోన్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ (సీఓఎస్) కె.హరి ఆదేశించారు. గురువారం రాయదుర్గం ఏపీఎస్ ఆర్టీసీ డిపోను ఆర్టీసీ రాయలసీమ జోన్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ (సీఓఎస్) కె.హరి తనిఖీ చేశారు. స్థానిక డిపో మేనేజర్ శ్రీనివాసరావుతో కలిసి కార్మికులు, ఉద్యోగులు, సూపర్‌వైజర్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అంతకుముందు స్టోర్, ఆఫీస్ సెక్షన్, డిపోలోని బస్సులు, గ్యారేజీలోని బస్సుల కండిషన్లు, సర్వీసు ఆపరేషన్ పరిస్థితులను తనిఖీ చేశారు. బస్సుల నిర్వహణలో, బస్సులు నడపడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను తెలియజేశారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌చార్జ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ ఎగువపల్లికి చెందిన రామక్రిష్ణ(64) బుధవారం రాత్రి ద్విచక్రవాహనంలో ఇల్లూరుకు వెళ్లి అక్కడ ప నిముగించుకుని ఇంటికి వెళ్తుండగా జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో రాగానే టిప్పర్‌ను ఢీ కొనడంతో రామక్రిష్ణ గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చినుకు పడితే మడుగే..





రోడ్డుపై నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామంలో ప్రధాన రహదారి పక్కన పూర్వం నుంచి ఉన్న కాలువను కొందరు ఆక్రమించి అడ్డుగా నిర్మాణాలు చేపట్టారు. చిన్నపాటి వర్షానికి కూడా నీరు వెళ్లేందుకు అవకాశం లేక రోడ్డుపై మోకాళ్లలోతు నిలబడుతోంది. గురువారం ఉదయం వచ్చిన తేలికపాటి వర్షానికి ఇదిగో ఇలా రోడ్డుపై నీరంతా నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– రాప్తాడు రూరల్:

మస్తానయ్య ఉరుసుకు భారీ బందోబస్తు

గుంతకల్లు: హజరత్ మస్తానయ్య ఉరుసు ఉత్సవాలకు భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు డీయస్పీ ఆముదాల శ్రీనివాస్ తెలిపారు. గురువారం డీయస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహించే ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా దక్షిణ భారత దేశ నలమూలల నుంచి వేలాదిగా మస్తానయ్య స్వామి భక్తులు తరలివస్తారు. ఇందులో భాగంగా ఎనిమిది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 170 మంది కానిస్టేబుళ్లు, 50 మంది హోంగార్డులతోపాటు 20 మంది మహిళ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

వృద్ధురాలి మృతి

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు మృతిచెందింది. వివరాలు.. పట్టణంలోని కర్నూల్ రోడ్డులో బిశ్వాస్ క్లినిక్ సమీపంలో బుధవారం రాత్రి ఉప్పర వీధికి చెందిన లక్ష్మిదేవి(65) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీ కొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున వృద్ధురాలు మృతి చెందింది. ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జేఏసీ అధ్యక్షుడు అమర్ యాదవ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.6030 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నిధులు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని గుర్తు చేశారు. త్వరితగతిన బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్, పార్థసారధి, మురళి, లిఖిత్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.